క్లుప్తంగా

తూడిచెర్ల సబ్‌చానల్‌కు 300 క్యూసెక్కుల నీరు


కేసీ కెనాల్‌లో ప్రవహిస్తున్న నీరు

పాములపాడు: మండలంలోని కేసీ కెనాల్ 120 వ కిలోమీటర్ లాకిన్సులా నుంచి శనివారం 300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఏఈ శ్రీనివాసనాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుంకేశుల నుంచి 1,500 క్యూసెక్కుల నీరు కేసీ కెనాల్‌లోకి వస్తుందన్నారు. లాకిన్సులా నుంచి అలగనూరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు 20 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని, నిప్పుల వాగుకు నిలుపుదల చేశామని వివరించారు.

బొల్లవరంలో గ్రామోత్సవం


స్వామి, అమ్మవారి గ్రామోత్సవ దృశ్యం

మహానంది: బొల్లవరంలో కొలువైన రాజరాజేశ్వరీ సమేత చంద్రమౌళీశ్వరస్వామి దంపతులకు శనివారం, ఏకాదశి పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో హోమాలు, మహాపూర్ణాహుతి అనంతరం రాత్రి గ్రామోత్సవం కనుల పండువగా జరిపారు.

సైకిల్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

● టైలర్‌కు గాయాలు

నందికొట్కూరు: పట్టణంలోని పటేల్ సెంటర్ వద్ద శనివారం రాత్రి సైకిల్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో టైలరు మూర్తుజావలికి గాయాలయ్యాయి. టౌన్ ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాలు.. నందికొట్కూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు పగిడ్యాల మండలం ఘనపురం గ్రామానికి బయల్దేరింది. పటేల్ సెంటర్‌లో కుమార్ మొబైల్ షాపు ఎదురుగా ఎడమ వైపున ఆర్టీసీ బస్సు సైకిల్‌ను ఢీకొంది. ప్రమాదంలో సైకిల్‌పై వెళ్తున్న టైలర్ మూర్తుజావలి గాయపడటంతో స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు అంబులెన్స్‌లో తరలించారు. ఆర్టీసీ బస్సును పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఘటనపై పూర్తి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోళ్లపాడులో పొట్టేళ్ల పోటీలు


పొట్టేళ్ల విజేతలకు బహుమతులు అందజేస్తున్న కమిటీ నిర్వాహకులు

మిడుతూరు: బరక సంజీవరాయ స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం రోళ్లపాడులో జిల్లా స్థాయి పొట్టేళ్ల పోటీలు నిర్వహించారు. పోటీల్లో వివిధ ప్రాంతాల నుంచి 20 పొట్టేళ్లు పాల్గొన్నాయి. మిడుతూరు మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన హనుమ పొట్టేలు మొదటి స్థానంలో నిలిచి రూ.15 వేలు గెలుచుకుంది. రెండవ స్థానంలో గుడిపాడుకు చెందిన అనూష పొట్టేలు రూ.10 వేలు గెలుచుకుంది. మూడవ స్థానంలో చింతలపల్లె గ్రామానికి చెందిన భవీష్ పొట్టేలు రూ. 5వేలు గెలుచుకున్నాయి. నాల్గవ స్థానంలో మండ్ల గణేష్ పొట్టేలు నిలువగా రూ. 3 వేలు అందజేశారు.

సంగమేశ్వరంలో భీష్మ ఏకాదశి పూజలు


ప్రత్యేక అలంకరణలో దేవతామూర్తుల విగ్రహాలు

కొత్తపల్లి: పవిత్ర పుణ్యక్షేత్రమైన సప్తనది సంగమేశ్వరం ఎగువ పుష్కరఘాట్ వద్ద ఉన్న ఉమామహేశ్వరాలయంలో భీష్మ ఏకాదశి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయంలోని శ్రీ లలితా సంగమేశ్వరస్వామి, శ్రీదేవి,భూదేవి సమేత లక్ష్మీ వెంకటేశ్వర స్వామి, లక్ష్మీ నరసింహస్వామి, పరివార దేవతలు, నవగ్రహములు, సత్యనారాయణ స్వామి వ్రత పీఠాలను ప్రత్యేకంగా అలంకరించారు. తర్వాత విశేష పూజాకార్యక్రమాలు నిర్వహించారు.

అల్లర్లకు దూరంగా ఉండండి

కొత్తపల్లి: గ్రామాల్లో ప్రజలు అల్లర్లకు దూరంగా ఉండాలని ఎస్ఐ కేశవ సూచించారు. శనివారం రాత్రి మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు అల్లర్లు, గొడవలకు దూరంగా ఉండాలన్నారు. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలపై, బాల్యవివాహాలపై, రోడ్డు యాక్సిడెంట్లు, డ్రగ్స్ వాడకం వల్ల కలిగే నష్టాలు, ఓటీపీ మోసాలపై జాగ్రత్తగా ఉండాలన్నారు.

యథేచ్ఛగా యూరియా దందా!

మొక్కజొన్న, వరి పంటలకు యూరియా ఎంతో అవసరం. దీన్ని ఆసరాగా చేసుకుని ప్రైవేట్ వ్యాపారులు దందాకు తెరలేపారు. ఎమ్మార్పీ కంటే ఒక్కో బస్తాపై దాదాపు రూ.150 పెంచి విక్రయించి అన్నదాతలను నిలువునా మోసం చేస్తున్నారు. కృత్రిమ కొరతను సృష్టించి యూరియా కావాలంటే మరిన్ని ఎరువులు కొనాల్సిందేనని పట్టుబట్టి అంటగడుతున్నారు. దుకాణాలపై పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు చేష్టలుడిగి చూస్తుండటంతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోతున్నారు.

- కృత్రిమ కొరత సృష్టించి.. అధిక ధరకు విక్రయిస్తున్న ప్రైవేట్ వ్యాపారులు
- ఎమ్మార్పీ కంటే రూ.100 నుంచి రూ.150 వరకు అధికంగా వసూలు
- మరిన్ని ఎరువులు అంటగడుతున్న దుకాణాదారులు


ప్రైవేట్ దుకాణాలకు లారీల్లో దిగుమతి అవుతున్న ఎరువులు

ఆత్మకూరు: ఆత్మకూరు డివిజన్‌పరిధితో పాటు బండిఆత్మకూరు, వెలుగోడు, మహానంది మండలాల్లో యూరియా రైతులకు ఎంతో అవసరం. ప్రైవేట్ దుకాణాల నిర్వాహకులు కుమ్మక్కై యూరియాకు కృత్రిమ కొరతను సృష్టిస్తున్నారు. దుకాణాలకు రైతులు స్వయంగా వెళ్లి యూరియా కావాలని అడిగితే లేదంటూ సమాధానం చెబుతున్నారు. కచ్చితంగా కావాలంటే మరిన్ని ఎరువులు కూడా కొనుగోలు చేస్తామంటే తెప్పిస్తామని ఆశ పెడుతున్నారు. తప్పని పరిస్థితుల్లో రైతులు అంగీకరిస్తూ ఆర్థిక భారానికి గురవుతున్నారు. ఇటీవల కృష్ణాపురం గ్రామానికి చెందిన ఓ రైతు యూరియా కావాలని దుకాణంలో కోరగా టన్నుల కొద్దీ నిల్వ ఉన్నా...లేవని సమాధానం ఇవ్వడమే ఇందుకు నిదర్శనం.

అధిక ధరకు..

ఆత్మకూరులో ఆగ్రోస్, గ్రోమోర్‌తో పాటు పలు ప్రైవేట్ దుకాణాలు ఉన్నాయి. యూరియా బస్తా ధర రూ.266.50 విక్రయించాల్సి ఉంది. అయితే రైతుల అవసరాన్ని ఆసరాగా తీసుకుని ఒక్కో బస్తాను ఎమ్మార్పీ కంటే రూ.100 నుంచి రూ.150 వరకు అధిక ధరకు విక్రయిస్తున్నారు. ఫలితంగా ఒక్కో బస్తా రూ.400 దాకా పలుకుతుంది. అంటే రూ.366 నుంచి రూ.400 దాకా యూరియా బస్తాను విక్రయిస్తున్నారు. దీనికి తోడు ఇతర కాంప్లెక్స్ ఎరువులను కూడా కొనుగోలు చేయాలని తెగేసి చెబుతున్నారు. వ్యాపారులు, దళారులు రైతుల వద్ద అధిక రేట్లకు అమ్మకాలు చేస్తూ దోచుకుంటున్నప్పటికీ స్థానిక వ్యవసాయాధికారుల్లో స్పందన లేదు.

విస్తారంగా వరి సాగు చేయడంతో..

డివిజన్ పరిధిలో తెలుగంగ, కేసీ కెనాల్ కింద విస్తారంగా వరి పంట సాగు చేశారు. వెలుగోడు, బండిఆత్మకూరు, మహానంది మండలాలల్లో వేలాది ఎకరాల్లో వరి సాగుచేయడంతో యూరియాకు డిమాండ్ ఏర్పడింది. రైతుల అవసరాన్ని ఆసరాగా తీసుకుని దుకాణ యజమానులు సొమ్ము చేసుకునేందుకు అక్రమార్జనకు పాల్పడుతున్నారు. యూరియా ధర ప్రభుత్వ నిబంధనల మేరకు ఎమ్మార్పీ ధరకు విక్రయించాల్సి ఉండగా అధిక ధరలకు(రూ.366 నుంచి రూ.400) విక్రయిస్తున్నారు. దీనికి తోడు తప్పనిసరిగా డీఏపీ, 28280, 143714, 20-20 0-13 , లాంటి ఇతర కాంప్లెక్స్ ఎరువులు కొనాలని మెలికపెడుతున్నారు.

యూరియా లేదంటున్నారు



వరి సాగుచేశాం. పైరుకు యూరియా దొరకడం లేదు. ప్రైవేట్ దుకాణాల వద్ద యూరియా అడిగితే స్పందించడం లేదు. సహకార సంఘాల వద్ద కొంత యూరియా ఉన్నప్పటికీ వారు కూడా సక్రమంగా ఇవ్వడం లేదు. మా అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు సరఫరా చేయాలే తప్పా అధిక ధరలకు విక్రయిస్తున్నా పట్టీపట్టనట్లు వ్యవహరించడం సరికాదు. రైతులకు కావాల్సిన విధంగా ఎరువులను సరఫరా చేయాలి.

– ఉదారు రామస్వామిరెడ్డి, రైతు, అబ్దుల్లాపురం గ్రామం

నంద్యాల నుంచి తెచ్చుకున్నాను



వరి సాగు చేశాను. యూరియా కోసం పలు దుకాణాలు తిరిగాను. లేదనడంతో విధి లేని పరిస్థితుల్లో నంద్యాలకు వెళ్లి తెచ్చుకున్నా. ధరతో పాటు ఆటో బాడుగ, సమయం వృథా అయ్యింది. వ్యవసాయ అధికారులు స్పందించి రైతులకు కావాల్సినంత యూరియా, కాంప్లెక్స్ ఎరువులను అందించాలి.

– పరదేశి చెన్నయ్య, రైతు, బండిఆత్మకూరు

ఎరువులు అందుబాటులో ఉన్నాయి



ఆత్మకూరు డివిజన్‌లో ఎరువులు అందుబాటులో ఉన్నాయి. వెలుగోడు మండలంలో యూరియా కొరతగా ఉన్నప్పటికీ వారికి అవసరమైన యూరియా సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. యూరియా కావాల్సిన రైతులు నేరుగా వ్యవసాయ అధికారులను సంప్రదించాలి. బ్లాక్‌లో కొనుగోలు చేయవద్దు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే విచారించి లైసెన్సులు రద్దు చేస్తాం.

– ఆంజనేయులు, ఏడీఏ ఆత్మకూరు

మహానందీశుడి దంపతులకు కల్యాణం

మహానంది: మహానందిలో కొలువైన గంగ, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి దంపతులకు మాఘమాసం, శనివారం కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు నాగేశ్వరశర్మ, హనుమంతుశర్మ, శాంతారాంభట్‌లు స్థానిక అలంకార మండపంలో స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి శాస్త్రోక్త పూజలు చేశారు. పలు ప్రాంతాల భక్తులు కల్యాణోత్సవాన్ని కనులారా తిలకించి స్వామి, అమ్మవారి అనుగ్రహం పొందారు.

వార్డు మెంబర్లపై ఎంపీటీసీ పెత్తనం తగదు

పగిడ్యాల: వైఎస్సార్‌సీపీ మద్దతుతో గెలుపొందిన 9 మంది వార్డు మెంబర్లపై పార్టీ ఫిరాయించి టీడీపీలోకి వెళ్లిన ఎంపీటీసీ చంద్రమోహన్‌నాయుడు పెత్తనం తగదని వైఎస్సార్‌సీపీ నాయకులు మండ్ల పులేంద్రనాయుడు హితవు పలికారు. శనివారం నెహ్రూనగర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తనకు వార్డు మెంబర్ల మద్దతు ఉందని, పనులు చేసేందుకు తీర్మానాలు ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శిపై ఒత్తిళ్లు చేయడం సమంజసం కాదన్నారు. గ్రామాభ్యుదయం కోసం ఎమ్మెల్యే నిధులు, ఎంపీ నిధులు మంజూరు చేయిస్తామంటే స్వాగతిస్తామని, వైఎస్సార్‌సీపీ తరఫున గెలిచిన వార్డు సభ్యుల మద్దతు కాకుండా టీడీపీ తరఫున గెలిచిన వార్డు సభ్యుల మద్దతు తీసుకుంటే తమకెలాంటి అభ్యంతరం లేదన్నారు. సమావేశంలో వార్డు సభ్యులు నరసింహారాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉస్మాన్‌బాషా పాల్గొన్నారు.

పరామర్శ

జూపాడుబంగ్లా: మండలంలోని తాటిపాడు గ్రామానికి చెందిన ఆర్ఎంపీ ఎర్రన్న తండ్రి నల్లమల దేవన్న(85) అనారోగ్యంతో శనివారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు, జెడ్పీటీసీ సభ్యుడు పోచా జగదీశ్వర రెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుమలేశ్వర రెడ్డి తదితరులు మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు.

అనధికారిక వ్యక్తుల వ్యవస్థపై ఈఓ ఆగ్రహం


కోనేర్ వద్ద పరిశీలిస్తున్న ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి

మహానంది: మహానంది దేవస్థానంలో అనధికారికంగా ఎవరైనా విధులు నిర్వహిస్తే చూస్తూ ఊరుకునేది లేదని, అలాంటి వారెవరైనా ఉంటే వెంటనే బయటికి పంపించాలని ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. శనివారం ఆలయ ప్రాంగణంలో ఏర్పాట్లు పరిశీలించారు. మహానంది దేవస్థానంలో కొందరు అనధికారి వ్యక్తులు విధులు నిర్వహిస్తుండటం, మరికొందరు యంత్రాలు, మాలలు, రుద్రాక్షలు అనధికారింగా విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని ఫిర్యాదులు వస్తున్నాయని, సంబంధిత సిబ్బంది పర్యవేక్షిస్తూ అలాంటివేమైనా ఉంటే కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని కోనేరుల వద్ద ఏర్పాట్లు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. రుద్రగుండం కోనేరుల వద్ద మండపాల్లో మహిళ కోసం ఏర్పాటు చేసిన వస్త్రాలు మార్చుకునే గదులలో కొందరు మల, మూత్ర విసర్జనలు చేస్తున్నారని పలువురు ఈఓ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వాటిని బయటికి మార్చేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆయన వెంట ఏఈఓ ఎరమల మధు, సూపరింటెండెంట్ అంబటి శశిధర్‌రెడ్డి, ఏఈ శ్రీనివాసులు యాదవ్ పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన మహానంది

వీకెండ్ సందర్భంగా మహానంది ఆలయం శనివారం సాయంత్రం భక్తులతో కిటకిటలాడింది. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు పలు ప్రాంతాలకు చెందిన వేలాది మంది విద్యార్థులతో పాటు భక్తులు తరలివచ్చారు. ఉదయం నుంచి మధ్యాహ్నం ఆలయ తలుపులు మూసే వరకు భక్తులు లేక ఆలయ ప్రాంగణాలు వెలవెలబోగా సాయంత్రం నుంచి రాత్రి వరకు రద్దీ కనిపించింది. భక్తజనం స్వామి, అమ్మవార్లకు జరిగిన అష్టవిధ మహామంగళ హారతుల సేవా పూజల్లో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

ఆహార పదార్థాల్లో నాణ్యత లోపంపై ఆగ్రహం

మహానంది: గాజులపల్లె వద్ద ఉన్న పద్మశివ డాబాలో ఆహార పదార్థాలు నాణ్యతగా లేకపోగా, నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చిన సదరు డాబా నిర్వాహకుడిపై న్యాయమూర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయాన్ని వెంటనే నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా దృష్టికి సైతం తీసుకెళ్లారు. అనంతపురం జిల్లాకు చెందిన ఓ న్యాయమూర్తి శనివారం విజయవాడ నుంచి అనంతపురం వైపు వెళ్తూ గాజులపల్లెలోని పద్మశివ డాబాలో భోజనాలు చేశారు. ఆహార పదార్థాలు నాణ్యతగా లేకపోవడంతో ప్రశ్నిస్తే నిర్వాహకులు నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారు. దీంతో వారిపై న్యాయమూర్తి ఆగ్రహం వ్యక్తం చేసి వెంటనే నంద్యాల జిల్లా ఎస్పీకి విషయం తెలియజేశారు. అనంతరం ఆయన ఆదేశాల మేరకు మహానంది ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి చేరుకుని విచారణ చేసి డాబా నిర్వాహకులతో మాట్లాడారు. దీంతో పాటు న్యాయమూర్తి నంద్యాల జిల్లా ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ వెంకటరాముడు, సిబ్బందికి ఫిర్యాదు చేయడంతో వారు డాబా వద్దకు చేరుకుని పెరుగు, సాంబార్‌లతో పాటు కందిబేడలు తీసుకుని టెస్టింగ్‌కు పంపించారు. పరీక్షల ఫలితాలు వచ్చిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటామని ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ వెంకటరాముడు తెలిపారు.

శనగ దిగుబడులు దగ్ధం


దగ్ధమవుతున్న శనగ పంట

మిడుతూరు: మండల కేంద్రానికి చెందిన ఇద్దరి రైతుల శనగ దిగుబడులు దగ్ధమయ్యాయి. బాధిత రైతులు తెలిపిన వివరాలు.. మిడుతూరు గ్రామానికి చెందిన రైతు సుజ్ఞానం 397-1 సర్వే నంబరులో 1.70 ఎకరాలు, సంజీవడు 398-1లో సర్వే నంబరులో 1.75 ఎకరాల్లో శనగ పంట సాగు చేసారు. శనివారం సాయంత్రం శనగ పంటను కోత కోసి నూర్పిడి కోసం కుప్పగా వేసి ఇళ్లకు చేరుకున్నారు. చీకటి పడిన తర్వాత మంటలు ఎగిసి పడుతుండటం చూసి అక్కడికి పరుగులు తీయగా పూర్తిగా కాలిపోయింది. 30 నుంచి 40 క్వింటాళ్ల దిగుబడి పూర్తిగా దగ్ధమైందని రైతులు కన్నీరుమున్నీరయ్యారు. ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.

గ్రామాలకు దూరంగా హైవేపై బస్టాప్‌లు

● ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు



గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో హైవేపై నిర్మించిన మండ్లెం బస్టాప్

జూపాడుబంగ్లా: హైవే అధికారులు, కాంట్రాక్టర్ల నిర్వాహకం చూస్తుంటే హవ్వా అంటూ ప్రయాణికులు ముక్కున వేలేసుకొంటున్నారు. నేషనల్ హైవే 340సీ రోడ్డు నిర్మాణంలో భాగంగా హైవే పై ప్రయాణికులకు అనుకూలంగా బస్టాండ్లు నిర్మిస్తున్నారు. బస్టాండు అనగానే గ్రామానికి సమీపంలో ప్రయాణికులు బస్సులు ఎక్కేందుకు, దిగేందుకు అనుకూలంగా ఉంటుందని ఎవ్వరైనా టక్కున చెప్పగలుగుతారు. అయితే హైవే అధికారులు, కాంట్రాక్టర్లు నిర్మిస్తున్న బస్టాండ్లు గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో బస్టాండ్లు నిర్మిస్తుండటంతో గ్రామస్తులు ఇదెక్కటి చోద్యం..బస్టాండు ఊరికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉంటే మేమెలా బస్సులు ఎక్కేది, దిగేదంటూ ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. హైవే పై మండ్లెం, గార్గేయపురం గ్రామాల కోసం ఏర్పాటుచేసిన బస్టాండ్లు గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో తర్తూరు అంచెదాటిన తర్వాత నిర్మించారు. మండ్లెం, గార్గేయపురం గ్రామస్తులు ఎవ్వరైనా ఆత్మకూరు, శ్రీశైలం, విజయవాడ, కర్నూలు, హైదరాబాదు వంటి ప్రాంతాలకు వెళ్లాలంటే రెండు కిలోమీటర్ల దూరంలో నిర్మించిన బస్టాండుకు వెళ్లి బస్సులు ఎక్కి, దిగాల్సి ఉంటుంది. రాత్రి వేళల్లో బస్టాండుకు వెళ్లాలన్నా, అక్కడి నుంచి గ్రామానికి చేరుకోవాలన్నా రెండు కిలోమీటర్లు కాలినడకన చేరుకోవాల్సి ఉంటుందని ప్రయాణికులు పేర్కొంటున్నారు. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని హైవే అధికారులు గ్రామానికి సమీపంలో బస్టాండ్లు ఏర్పాటు చేయించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

శ్రీశైలంలో నేడు స్వర్ణరథోత్సవం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలం మహా క్షేత్రంలో ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆదివారం ఉదయం 8.30 గంటలకు స్వర్ణ రథోత్సవం నిర్వహించనున్నట్లు దేవస్థాన ఈఓ ఎం. శ్రీనివాసరావు శనివారం తెలిపారు. వేకువజామున స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, విశేష పూజల అనంతరం ఆలయ మాడవీధులలో స్వర్ణ రథోత్సవం ఉంటుందన్నారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి రథోత్సవంలో పాల్గొనాలన్నారు.

ఆంజనేయస్వామి విగ్రహం ఊరేగింపు

నందికొట్కూరు: స్థానిక మారుతీనగర్ ఆంజనేయ స్వామి ఆలయానికి నూతన విగ్రహం శుక్రవారం రాత్రి చేరింది. పట్టణ సమీపంలోని పగిడ్యాల రోడ్డు-కొణిదేల రోడ్డుకు వెళ్లే మార్గాల వద్ద ఆంజనేయస్వామి విగ్రహం ఏర్పాటు చేసేందుకు భక్తులు ఆళ్లగడ్డలో తయారు చేయించి తెచ్చారు. విగ్రహాన్ని శనివారం మారుతీనగర్ ఆంజనేయస్వామి ఆలయం నుంచి బ్రహ్మంగారి మఠం వరకు మేళాతాళాల మధ్య భక్తులు ఊరేగింపు నిర్వహించారు. ఈనెల 10న పగిడ్యాల-కొణిదేల రహదారుల వద్ద ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు ఘనంగా నిర్వహించనునట్లు భక్తులు తెలిపారు.

బీజేపీ విజయంపై సంబరాలు

పాములపాడు: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ విజయకేతనం ఎగురవేయటంతో ఆ పార్టీ మండల నాయకులు శనివారం సంబరాలు చేసుకున్నారు. పార్టీ మండల అధ్యక్షుడు మురళీమోహన్ మాట్లాడుతూ 27 ఏళ్ల తర్వాత ఢిల్లీ పీఠంపై బీజేపీ జెండా ఎగరటం సంతోషకరమన్నారు. ఎన్నికల బరిలో నిలిచిన ఆప్ అగ్రనేతలు ఓటమి పాలయ్యారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఖాతానే తెరవలేదన్నారు. బీజేపీతోనే సంక్షేమాభివృద్ధి సాధ్యమవుతుందని భావించిన ఢిల్లీ ప్రజలు బీజేపీకి పట్టం కట్టారన్నారు. అనంతరం వారు స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మురళి, రామకృష్ణ, హేమచంద్ర, భాస్కర్, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

దోమల నివారణ చర్యలు

ఆత్మకూరు: మండలంలోని కురుకుంద గ్రామంలో శనివారం రాత్రి సర్పంచ్ మహబూబ్‌బీ ఆధ్వర్యంలో దోమల నివారణకు ఫాగింగ్ నిర్వహించారు. అలాగే పారిశుద్ధ్య పనులు చేపట్టామని, మురుగు నీరు నిల్వ ఉండకుండా కాలువల్లో పూడికలు తీస్తున్నామని సర్పంచ్ తెలిపారు. పూడిక తీసిన చెత్తా చెదారాన్ని ట్రాక్టర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నామని, నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో వేస్ట్ ఆయిల్ చల్లుతున్నట్లు తెలిపారు.

అటవీ భూముల ఆక్రమణపై సర్వే

మహానంది: మహానంది మండలంలోని అటవీ భూములపై సర్వే చేస్తున్నట్లు అటవీశాఖ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ హైమావతి తెలిపారు. అటవీశాఖ, రెవెన్యూశాఖల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం సర్వే ప్రారంభించారు. డీఆర్‌ఓ హైమావతి మాట్లాడుతూ మండలంలోని పలు అటవీశాఖకు చెందిన సర్వే నెంబర్లలో కొలతలు వేస్తున్నట్లు చెప్పారు. ఎవరైనా అటవీశాఖ భూములను ఆక్రమించుకుని ఉంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

ముగిసిన మద్యం దుకాణాల దరఖాస్తు గడువు

నందికొట్కూరు: గీత కులాల మద్యం షాపుల దరఖాస్తులు గడువు ముగిసిందని ఎక్సైజ్ శాఖ సీఐ రామాంజనేయులు నాయక్ తెలిపారు. శనివారం ఎక్సైజ్ కార్యాలయంలో గీత కులాల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నందికొట్కూరు మున్సిపాలిటీకి 9, జూపాడుబంగ్లా మండలానికి 10, పగిడ్యాల మండలానికి 1 దరఖాస్తు వచ్చిందన్నారు.

బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఈఓ, ఏఈఓ, పండితులు

మహానంది: మహానందిలో 24 నుంచి ఐదు రోజుల పాటు జరగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి తెలిపారు. అలంకార మండపంలో శనివారం బ్రహ్మోత్సవాల పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ పెళ్లిపెద్ద నంద్యాల బ్రహ్మనందీశ్వరస్వామి వార్లను ఆహ్వానించేందుకు 22న మహానందీశ్వరుడి దంపతులు వెళ్లి, 23న తిరిగి వస్తారన్నారు. 24 నుంచి పూజలు ప్రారంభమవుతాయని, సాయంత్రం ధ్వజారోహణం పూజలు శాస్త్రోక్తంగా చేపడతారని తెలిపారు. ప్రతి రోజూ స్వామి, అమ్మవార్లకు ఉదయం, రాత్రి వాహనసేవలు, గ్రామోత్సవాలు ఉంటాయన్నారు. 26న మహాలింగోద్భవం సందర్భంగా (మహా శివరాత్రి) మహారుద్రాభిషేకం, మరుసటి రోజు(27న) తెల్లవారుజామున మహానందీశ్వర కల్యాణం, రాత్రి పుష్పపల్లకీ సేవ, 28న మహారథోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ ఎరమల మధు, సూపరింటెండెంట్ అంబటి శశిధర్‌రెడ్డి, ఏఈ శ్రీనివాసయాదవ్, ఆలయ ఇన్‌స్పెక్టర్ శ్రీశైలం శ్రీనివాసులు(చిన్నా) పాల్గొన్నారు.

వాహనదారులకు జరిమానా


ఆటోను తనిఖీ చేస్తున్న పోలీసులు

కొత్తపల్లి: ట్రాఫిక్ నియమాలు పాటించకుండా రోడ్లపై తిరుగుతున్న వాహదారులకు జరిమానా విధించామని ఎస్ఐ ఎం.కేశవ తెలిపారు. శనివారం దుద్యాల, మండల కేంద్రంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదన్నారు. రోడ్డుపై తిరిగేటప్పుడు సరైన ధ్రువపత్రాలు తమతోపాటు ఉంచుకోవాలన్నారు. లైసెన్స్, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఉండాలన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ కచ్చితంగా ధరించాలన్నారు. ట్రాఫిక్ నియమాలు పాటించని 12 మంది వాహనదారులకు రూ.1,620 జరిమానా విధించినట్లు తెలిపారు. నెంబర్ ప్లేట్ లేకుండా రోడ్డుపై వాహనాలు నడిపితే సీజ్ చేస్తామని హెచ్చరించారు.

10 మంది విద్యార్థినులకు అస్వస్థత

● ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన వైనం

గడివేముల: మండల కేంద్రమైన గడివేములలోని ఏపీ మోడల్ స్కూల్ హాస్టల్‌లో ఈ నెల 2వ తేదీ (ఆదివారం) చికెన్ తిని 10 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మోడల్ స్కూల్ హాస్టల్‌లో ఉండే విద్యార్థినులకు ఆదివారం మెనూలో చికెన్ ఉండడంతో నాణ్యత లేని చికెన్ తీసుకొచ్చారు. వండే సమయంలో ఉడకకపోవడంతో తిన్న 10 మంది విద్యార్థినులకు వాంతులు, కడుపునొప్పితో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. మరుసటి ఉదయం అధికం కావడంతో వార్డెన్ బయటకి తెలియకుండా స్థానిక ఆర్ఎంపీల వద్ద చికిత్స చేయించింది. ఎంతకు తగ్గక పోవడంతో విద్యార్థినుల తల్లిదండ్రులకు సమాచారం అందించడంతో నంద్యాలలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నట్లు తెలిసింది. ఇప్పటికీ ఇద్దరు విద్యార్థినులు ఆసుపత్రిలో ఉన్నట్లు సమాచారం. దీంతో హాస్టల్ నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థినులు చాలా మంది ఇంటికి వెళ్లిపోయారు. ఉన్నతాధికారులు విచారణ చేసి పాఠశాల ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

దేవస్థాన ఒప్పంద ఉద్యోగిపై చర్యలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో సహాయ ఇంజినీరుగా ఒప్పంద పద్ధతిపై విధులు నిర్వహిస్తున్న వి.రాజేశ్వరరావు శుక్రవారం రాత్రి శ్రీశైలంలో తన నివాస గృహంలో మరో వ్యక్తితో కలిసి మద్యం తాగినట్లు దేవస్థానం దృష్టికి రావడంతో అతనిని విధుల నుంచి తొలగించారు. కాగా దేవదాయ చట్టం 30/1987 అనుసరించి క్షేత్ర పరిధిలో పొగ, మద్యం తాగడం, మాంసాహారాన్ని భుజించడం పూర్తిగా నిషేధం. ఈ విషయమై క్షేత్ర పరిధిలో పలుచోట్ల సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. అయినా ఏఈ వి.రాజేశ్వరరావు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడంతో విధుల నుంచి తొలగించారు. ఏఈతో కలిసి మద్యం తాగిన వ్యక్తులపైనా కేసు నమోదు చేసి, విచారణ చేయాల్సిందిగా దేవస్థాన భద్రతా విభాగం సిబ్బంది వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రచయిత కొప్పల ప్రసాద్‌కు సత్కారం


రచయిత ప్రసాద్‌ను సన్మానిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): వైఎస్సార్ జిల్లాలోని కడపలోని ఐఎంఏ హాల్‌లో శనివారం నిర్వహించిన జిల్లా రచయితల మహాసభల్లో నంద్యాల రచయిత కొప్పుల ప్రసాద్‌ను నిర్వాహకులు సత్కరించారు. సాహితీ సంఘాల ప్రతినిధి, అంతర్జాతీయ శాస్త్రవేత్త డాక్టర్ రవీంద్రనాథ్ మాట్లాడుతూ..రచయితల మహాసభల్లో వెయ్యేళ్ల తెలుగు సాహిత్యం , రాయలసీమ భాగస్వామ్యం అనే అంశంపై మహాసభలు జరిగాయన్నారు. నంద్యాలకు చెందిన వర్ధమాన రచయిత కొప్పుల ప్రసాద్ పాల్గొని రాయలసీమలోని వర్షాభావ పరిస్థితులపై, సీమ వాన సవ్వడి అనే శీర్షికతో కవితాగానం చేశారు. వైఎస్సార్ కడప జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, కార్యదర్శి సుబ్రహ్మణ్యం ప్రసాద్‌ను సన్మానించారు.